సాక్షి శ్రీకాకుళం

శనివారం । 14 । జనవరి । 2023



మహేంద్ర గిరులందు..

మహేంద్ర గిరుల్లో జీవ వైవిధ్యం పరిఢవిల్లుతోంది. అనేక జాతుల వృక్షాలు, జీవాలు ఉన్నాయి.

- IIలో



కందిపప్పు నాణ్యతపై ఆరా

అధికారులు అంగన్‌వాడీల్లో కందిపప్పు నాణ్యత పరిశీలిస్తున్నారు. జిల్లా కేంద్రంలో పరిశీలనలు జరిగాయి.

- IIలో

నేడు గోదాదేవి, రంగనాథుల కల్యాణం

మందస: శ్రీవాసుదేవ పెరుమాళ్ స్వామి ఆలయంలో శనివారం గోదాదేవి, రంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు చెప్పారు. వేకువజామున వాసుదేవునికి అభిషేకం అనంతరం పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 10 గంటలకు కల్యాణం జరుగుతుందన్నారు.

న్యూస్‌రీల్

గోదాదేవికి తులసీ దళార్చన



గోదాదేవికి తులసీ దళాలతో అలంకరించిన దృశ్యం

సారవకోట: మండలంలోని చీడిపూడి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గోదాదేవికి తులసీదళాలతో అర్చన చేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వెంకటేశ్వర స్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించి ప్రత్యేక విశేష పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న గోదాదేవి విగ్రహానికి తులసీదళాలతో అర్చన చేసినట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు.

సంక్రాంతికి ఆదిత్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

అరసవల్లి: సంక్రాంతి పెద్ద పండుగ సందర్భంగా వరుస నాలుగు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించేలా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం శనివారం ఉదయం భోగి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించి, ప్రత్యేక ప్రసాదాలను స్వామికి నివేదించనున్నారు. అలాగే ఆదివారం మకర సంక్రాంతి సందర్భంగా మకర సంక్రమణ పంచామృతాభిషేకాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదిత్యుని మూలవిరాట్టుకు వేకువజామున క్షీరాభిషేకం జరుపనున్నారు. ఈ క్రమంలో నిజరూప దర్శనానికి కూడా అవకాశం ఉండడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఈ సేవలో పాల్గొననున్నారు. అలాగే కనుమ నాడు పెద్ద సంఖ్యలో రైతులు తమ పంట ఫలాలను స్వామికి నివేదించనున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రానికి ఆలయంలో భక్తుల దర్శనాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధానార్చకులు శంకరశర్మ, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పరిశీలించారు.

'తాత్కాలిక సర్దుబాటు రద్దు చేయాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కోర్టులో ఉందన్న నెపంతో సర్వీస్ నిబంధనలు లేకుండా, గతంలో ఇచ్చిన పదోన్నతులు చేపట్టకుండా, ప్రభుత్వం చేపట్టిన తాత్కాలిక పని సర్దుబాటును వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫ్యాప్టో సభ్య సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఫ్యాప్టో చైర్మన్ మజ్జి మదన్మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలను తుంగలో తొక్కి ప్రమోషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ ఉపాధ్యాయులను తాత్కాలికంగా ప్రమోషన్ పోస్టులో పనిచేయమని ఆదేశాలు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ కొమ్ము అప్పలరాజు మాట్లాడుతూ తాత్కాలిక సర్దుబాట్ల ద్వారా రూ.2500 చెల్లిస్తూ ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ ఇవ్వకుండా పనిచేయించుకోవడం వెట్టిచాకిరీ కిందకే వస్తుందని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో గానీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో కానీ మాట్లాడకుండా ఉత్తర్వులు విడుదల చేయడం సమంజసం కాదన్నారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ జీఓ నంబర్ 117 అసంబద్ధాలతో కూడి ఉందని ఆరోపించారు.

సంబరాల కళయిక

వీధి మధ్య భోగి మంటలో వేడి తగ్గకుండానే 'అయ్య గారికి దండం పెట్టు అంటూ..' గంగిరెద్దుల వారి ఆటాపాటా. కొత్తల్లుళ్లు, ఇంటి ఆడపడుచులతో ముచ్చట్లు సాగుతున్న వేళ.. 'శ్రీమన్నారాయణ..' అంటూ తప్పెటగుళ్ల దరువులు. ఇంటి పెరట అమ్మలు, అమ్మమ్మలు పిండి వంట పనుల్లో ఉంటే ముంగిట మురిపించే గిరిజనుల థింసా నాట్యాలు. కొత్త బట్టలేసుకుని పిల్లలు అరుగు మీదకు వస్తే కనిపించే నెయ్యి గుర్రం నృత్యాలు. ఒకటా రెండా.. సంక్రాంతి రోజులంటేనే పల్లె విశ్వరూప విన్యాసం చేసేది. ఈ కళలన్నీ ఇప్పుడు జ్ఞాపకాలుగా మారిపోతున్నాయి. ఓ తరానికి తీయని అనుభూతులు పంచిన ఈ జానపద రీతులు ఇప్పటి బాలలకు తెలియకుండా పోతున్నాయి. ఓ రకంగా ఇది 'కళ'వరం కలిగించే అంశమే. సంక్రాంతి వేళ మనవైన కళలను ఓ సారి కంటి ముందుకు తెచ్చుకుందాం.



గంగిరెద్దు విన్యాసం



నెయ్యిగుర్రం నృత్య ప్రదర్శన చేస్తున్న గిరిజనులు

చల్ చల్ గుర్రం..

సారవకోట: గుర్తుందా ఆ గుర్రం.. ఊరూఊరంతా సంక్రాంతి సంబరాల్లో ఉంటే వీధి మధ్యకు వచ్చే నెయ్యి గుర్రం ఒక తరానికి తీపి జ్ఞాపకం. మండలంలోని గిరిజన గ్రామాలైన బురుజువాడ, జగన్నాథపురం, రైవాడ, కోనవానిపేట, పురుషోత్తుకర్ర, సోమయ్యపేట తదితర గ్రామాల్లోని గిరిజనులు సంక్రాంతి నాలుగు రోజుల పాటు ఊళ్లలో ఈ నెయ్యి గుర్రంతో నృత్య ప్రదర్శనలు చేస్తుంటారు. వెదురు కర్రతో గుర్రం ఆకారాన్ని తయారు చేసి దాని చుట్టూ చీరతో కప్పుతారు. ఆ గుర్రంతో పాటు దెయ్యం ముఖం పెట్టుకున్న వ్యక్తి చేసే నృత్యం, రెండు పిన్నలకర్రలు, మద్దెల, తుడుము, లిడక వాయిద్యాలను వాయించే తీరు సిక్కోలు వాసులకు చాలా ప్రత్యేకం. దురదృష్టవశాత్తు ఈ తరానికి ఇలాంటి ఆనందాలు లేకుండా పోతున్నాయి. సంక్రాంతి రోజుల్లో ఈ నెయ్యిగుర్రం ప్రదర్శన చేసి సేకరించిన సొమ్ముతో గిరిజన సంప్రదాయ పద్ధతిలో కొండ దేవతలను పూజించడం, గ్రామాభివృద్ధికి కొంత వినియోగిస్తారు.

సంప్రదాయాన్ని కొనసాగించేందుకు చర్యలు



గిరిజన ఆచార, సంప్రదాయాన్ని కొనసాగించేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. నెయ్యి గుర్రం సారవకోట మండలంలోని చాలా గిరిజన గ్రామాల్లో పురాతనం నుంచి వస్తున్న ఆచారం. సంక్రాంతి నాలుగు రోజుల పాటు గ్రామాల్లో ప్రదర్శనలు ఇచ్చి విరాళాలు సేకరిస్తూ ఉంటాం. ఇప్పటి యువత ఈ నృత్య ప్రదర్శనకు ఆసక్తి కనబర్చడం లేదు.

– కొత్తూరు బోడేన్న, గిరిజన ఐక్యవేదిక మండలాధ్యక్షుడు, సారవకోట మండలం

బసవా.. ఇటు రావా

మందస: కొత్త అల్లుడు వచ్చినా రాకున్నా.. కొత్త బట్టలు వేసుకున్నా వేసుకోకపోయినా.. రంగవల్లులు పెట్టినా పెట్టకపోయినా.. బసవడు రాకుంటే మాత్రం పెద్ద పండగ రాదు. సిక్కోలు జానపద సంపదలో గంగిరెద్దుల వారికి ప్రత్యేక స్థానం ఉంటుంది. తరాల కిందట విశాఖలోని సింహాచలం నుంచి జిల్లా వరకు వచ్చి మందస సమీపంలోని భైరిసారంగపురం వద్ద స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న గంగిరెద్దుల వారు సంక్రాంతికి బసవన్నలను ఆడిస్తూ ఈ ఆటపాటలను ముందు తరాలకు అందిస్తున్నారు. ఉత్తరాంధ్రలోని గ్రామాల్లో భక్తులు సింహాద్రి అప్పన్నను మొక్కుకుని తమ పశువుల శాలలో పుట్టిన దూడలను కానీ కొనుగోలు చేసి కానీ వీరికి అందజేస్తారు. వీటిని బాగా మచ్చిక చేసుకుని, ఎంతో శ్రమించి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. తాము చెప్పినట్లు చేసేలా చేయిస్తారు. తౌడు, ఉలవలు, నువ్వులు, తెలకపిండి, పెసర, మినుము పొట్టు తదితర వాటితో దాణా ఇచ్చి, ముందుగా ఒక ఏడాది పాటు ప్రతి రోజూ శిక్షణ ఇస్తారు. వీటినే సంక్రాంతి రోజుల్లో వీధుల్లో తిప్పుతారు. గ్రామీణులు ఇచ్చే కానుకలతో ఏడాదంతా గడుపుతారు. ఒకప్పటిలా ఇప్పుడు అంత ఆదాయం లేదు. అయినా ఈ కళను వీరు వదలడం లేదు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన కళను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.



డూడూ బసవన్న అంటూ ఇళ్ల వద్ద సందడి చేస్తున్న గంగిరెద్దు కులస్తులు

ఆదరణ తగ్గుతోంది



గంగిరెద్దుల కళకు ఆదరణ తగ్గుతోంది. ఎద్దులకు ఆరు నెలలు శిక్షణ ఇచ్చి.. ఆరు నెలలు ముఠాకు వెళ్తాం. అప్పట్లో 120 కుటుంబాల వారం ఈ పనిచేసే వాళ్లం. ఇప్పుడు 30 కుటుంబాల వారే ఈ కళను కొనసాగిస్తున్నారు. సంక్రాంతికి ఒడిశా వాసులు గంగిరెద్దుల నృత్యాలకు ఎక్కువగా ఆదరిస్తారు. అంతేకాదు.. కళాకారులను గౌరవించి, భత్యాన్ని కూడా ఎక్కువగా ఇస్తారు.

– బాడ సూరన్న, జానపద కళాకారుడు, భైరిసారంగపురం

దరువు పడాల్సిందే..

మెళియాపుట్టి: ఉచ్ఛ్వాస నిశ్వాసలు మిళితమైన గానం.. గుండె లయ కలిసిపోయిన తాళం కలగలిపి తప్పెటగుళ్ల. సిక్కోలు తప్పెటగుళ్లకు పుట్టినిల్లు వంటిది. అందులోనూ మెళియాపుట్టి మండలంలో యాదవులు ఈ కళకు తరతరాలుగా కాపలా కాస్తున్నారు. మండలంలోని, కరజాడ, మర్రిపాడు–సి, చీపురుపల్లి, జలకలింగుపురం తదితర గ్రామాల్లో తప్పెటగుళ్ల ప్రదర్శించే బృందాలు ఉన్నాయి. రేకుతో తయారు చేసిన ఓ డప్పు వంటి వాయిద్యాన్ని గుండెకు కటకట్టుకుని చేసే విన్యాసాలు చూసి తీరాల్సిందే. సంక్రాంతి రోజుల్లో ఇది వరకు ఊరూరా తప్పెటగుళ్ల వినిపించేవి. కానీ ఇప్పుడు ప్రత్యేక కార్యక్రమాల్లో తప్ప వీరి విన్యాసాలు కనిపించడం లేదు. కరజాడ గ్రామానికి చెందిన జగన్, లోకనాథం, మర్రిపాడు–సి గ్రామానికి కృష్ణమూర్తిలకు చెందిన బృందాలు పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఏటా ప్రదర్శనలు ఇస్తుంటారు.

17 ఏళ్లుగా ఆడుతున్నా..



నేను 17 ఏళ్లుగా 15 మంది బృందంతో తప్పెటగుళ్ల ప్రదర్శనలు ఇస్తున్నాను. సాంస్కృతిక కార్యక్రమాలు, సంక్రాంతి సంబరాల్లో ఆ బృందం ఆడుతుంది. ప్రభుత్వాలు మమ్మల్ని గుర్తించాలి.

– తలగాన కృష్ణారావు, తప్పెటగుళ్ల బృందం గురువు, మర్రిపాడు–సి గ్రామం



జార్ఖండ్ జాతరలో ప్రదర్శన ఇస్తున్న కరజాడ బృందం(ఫైల్)

సిక్కోలులో టీడీపీ

- శ్రీకాకుళం నియోజకవర్గంలో తార స్థాయికి చేరిన విభేదాలు
- ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్న గుండ లక్ష్మీదేవి, గొండు శంకర్ వర్గీయులు
- అంపోలులో రోడ్డెక్కిన ఇరువర్గాలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

శ్రీకాకుళం టీడీపీ నేతల మధ్య విభేదాలు పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. ఆ పార్టీలో పంచాయతీ రోడ్డు మీదకు వచ్చింది. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి వెళ్లడంతో ఇదేమి ఖర్మ అని అటు నియోజకవర్గ ప్రజలు, ఇటు పోలీసులు తలలు పట్టుకోవాల్సి వచ్చింది.

నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీ దంపతులను పార్టీ కేడర్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కాలం చెల్లిన నేతలని గొండు శంకర్, కొర్ను ప్రతాప్ వర్గీయులు పక్కన పెట్టేస్తున్నారు. వారితో కలిసి పనిచేయలేమని, ఎమ్మెల్యే సీటు లక్ష్మీదేవికి ఇవ్వవద్దని, తమ నాయకులకే సీటు ఇవ్వాలని గొండు శంకర్ వర్గీయులు డిమాండ్ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు బల ప్రదర్శనకు సిద్ధమవుతున్నారు. దీంతో లక్ష్మీదేవీ వర్గం ఫ్రస్ట్రేషన్‌లోకి వెళ్లిపోయింది. తమను కాదన్న వారి సంగతి తేల్చుతామంటూ వార్నింగ్‌లు ఇవ్వగా, వీరికి దీటుగా గొండు శంకర్ వర్గీయులు కూడా తాడోపేడో తేల్చుకుంటామని కౌంటర్ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఆ పార్టీ అధిష్టానం పిలుపు ఇచ్చిన ఇదేమి ఖర్మ కార్యక్రమంలో బాహాబాహీకి సిద్ధమవుతున్నారు.

ఫైటింగ్‌కు రెడీ

గార మండలం అంపోలు పంచాయతీలో ఇదేమి ఖర్మ కార్యక్రమం నిర్వహించేందుకు మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి సన్నద్ధమవ్వగా, ఇక్కడ చేయడానికి వీల్లేదని గొండు శంకర్ వర్గీయులు అడ్డు తగిలారు. లక్ష్మీదేవి అనుచరుడు వెలమల శ్రీనివాసరావు నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించేందుకు ప్రయత్నించగా, గొండు శంకర్ అనుచరులైన మూర్తి, అచ్యుతరావులను అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. ఫోన్, వాట్సాప్ ద్వారా ఎవరు అడ్డుకుంటారో చూస్తామని లక్ష్మీదేవి వర్గం, ఎవరొచ్చి నిర్వహిస్తారో చూస్తామని గొండు శంకర్ వర్గీయులు వాదించుకుంటున్నారు. ఈ క్రమంలో ఓ వర్గానికి చెందిన వారిని మరో వర్గానికి చెందిన నాయకులు ఇటీవల జరిగిన రామేశ్వరు హత్య మాదిరిగా హతమార్చేస్తామని బెదిరింపులకు దిగినట్టుగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో అంపోలులో పార్టీ కార్యక్రమానికి బందోబస్తు కావాలని, తమను అడ్డుకోవడానికి గొండు శంకర్ వర్గీయులు ప్రయత్నిస్తున్నారని లక్ష్మీదేవి వర్గం శ్రీకాకుళం రూరల్ సీఐకు ఫిర్యాదు చేశారు. దీనికి కౌంటర్‌గా గొండు శంకర్ వర్గీయులు ఫిర్యాదు చేశారు. లక్ష్మీదేవి తమను బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొనట్టుగా సమాచారం. దీంతో పోలీసులకు వీరి వ్యవహారం తలనొప్పిగా మారింది. ఇరువర్గాలకు నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు కూడా. వీరి పంచాయతీ ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వద్దకు కూడా వెళ్లింది. కాకపోతే, వారిద్దరూ గోడ మీద పిల్లి మాదిరిగా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ దెబ్బకు ఏదొకటి తేలిపోతుందనే ధోరణితో వేచి చూస్తున్నారు.

నలిగిపోతున్న టీడీపీ శ్రేణులు

నేతల మధ్య తార స్థాయికి విభేదాలు చేరడంతో అక్కడి టీడీపీ శ్రేణులు నలిగిపోతున్నాయి. గుండ లక్ష్మీదేవి చేపట్టే కార్యక్రమాలకు వెళితే గొండు శంకర్ వర్గీయులు ఒప్పుకోరని, గొండు శంకర్ వర్గంతో వెళ్తే లక్ష్మీదేవి ఒప్పుకోరని, వీరి మధ్య తమకెందుకీ నరకమని గగ్గోలు పెడుతున్నారు. ప్రత్యర్థి పార్టీల నుంచి ఎటువంటి ఇబ్బంది లేదని, సొంత పార్టీనుంచే తలనొప్పులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఆకాశమంత.. ఆనంద'మంట'



కొత్త వెలుగులు వచ్చే వేళయ్యింది. ఊరు ముఖం వెలిగిపోయేలా భోగిమంటలు వాడవాడలా వేసుకునే రోజిది. ధాన్యలక్ష్మి ఇంటికి చేరిన వేళ అన్నదాత ఆనందంతో జరుపుకునే పెద్ద పండగకు సిక్కోలు ముస్తాబైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్‌రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 9550311265, 8121703348.

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

అమ్మా ఎందుకు వదిలేశావ్..?

- ఆడ పసికందును వదిలిపెట్టి వెళ్లిపోయిన కర్కశులు
- రోదన విని గుర్తించిన స్థానికులు
- ఆస్పత్రిలో చేర్చిన పోలీసులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆడ పసికందు

రణస్థలం:

రాత్రి 8 గంటల సమయం. చుట్టూ చిమ్మ చీకటి. మెల్లగా ముసురుకుంటున్న చలి గాలులు. నిశ్శబ్దమైన వాతావరణంలో వినిపించిన ఓ పసికందు రోదన కోష్ట గ్రామాన్ని ఉలిక్కిపడేలా చేసింది. తొమ్మిది నెలలు అమ్మ కడుపులో భద్రంగా ఉన్న బిడ్డ ఆ పేగు తెంచుకున్నాక.. బంధాలకు కూడా దూరమై ఇలా చీకటిలో నిస్సహాయంగా స్థానికుల కంట పడింది. జేఆర్‌పురం ఎస్‌ఐ జి.రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. కోష్ట గ్రామంలోని ఒక కర్రల మోపుపై ఎవరో ఒక ఆడ పసికందును విడిచిపెట్టి వెళ్లిపోయారు. స్థానికులు పసిపాప ఏడుపులు విని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్‌ఐ రాజేష్ పాపను రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ బిడ్డను ఎవరు ఇక్కడ వదిలి వెళ్లిపోయారో తెలియాల్సి ఉంది.

పసికందు 1.5 కిలోల బరువు ఉందని, జన్మించి ఒక రోజు అయి ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

నాపై ఆరోపణలు రుజువు చెయ్యగలరా..?

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విమర్శలు చేయడం సబబు కాదని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్దానంలో ప్రస్తుతం జరుగుతున్న ప్రాజెక్టుల గురించి పవన్ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ ప్రాంత ప్రయోజనాల కోసమే తాను మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. ఇటీవల రాజాం వచ్చిన చంద్రబాబు అమరావతి ఒక్కటే రాజధాని అనడం ఎంతవరకు సబబన్నారు. అలా అయితే మళ్లీ ఓ యాభై ఏళ్లు మేం వెనక్కు పోవాల్సి వస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నాడు–నేడు కింద స్కూళ్లలో సమూల మార్పులు తీసుకువచ్చారని, నిరుపేదలకు వైద్యం అందేలా విలేజ్ క్లినిక్‌లు, ప్రభుత్వ హాస్పటల్స్‌లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించారని గుర్తు చేశారు. విశాఖలో తాను భూములు కబ్జా చేశానని అంటున్న వారు రుజువు చేయగలరా అని సవాల్ విసిరారు. ఈనాడు పేపర్లో అబద్ధపు రాతలు నమ్మి పవన్ మాట్లాడడం సరికాదన్నారు. ఒక సైనికుడికి ఓ అసైన్డ్ భూమి ఇస్తే పదేళ్ల తర్వాత ఆ భూమి అమ్ముకోవచ్చని, అలా కాకుండా ముందుగా ఏ సైనికుడైనా తన భూమిని అమ్మేస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రెవెన్యూ మంత్రికి భూములు కేటాయించే నిర్ణయాధికారం లేదన్నారు. సమాజం కోసం గళమెత్తిన వారి గొంతులు నొక్కేయడానికి చంద్రబాబు, రామోజీల చేసిన విషప్రచారం ఈ విషయం ప్రజలందరికి తెలుసునన్నారు. ఓ కళాకారుడిగా పవన్‌పై గౌరవం ఉందని, రాజకీయ పార్టీ పెట్టడంపై కూడా గౌరవం ఉందని, కానీ దాన్ని నడిపే విధానంలోనే సమస్య ఉందన్నారు. మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. ఇతర జిల్లాలతో సమానంగా శ్రీకాకుళం కూడా ఎదగాలనే తన ఆకాంక్ష అని స్పష్టం చేశారు. భావనపాడు కోసం ఇప్పటికే భూసేకరణ పూర్తిచేశామన్నారు. బుడగట్ల ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాకు రిమ్స్ మెడికల్ కాలేజ్, వంశధార ప్రాజెక్టు, అంబేడ్కర్ యూనివర్శిటీ, ఆఫ్‌షోర్ రిజర్వాయర్, తోటపల్లి ప్రాజెక్టు వంటివి అనేకం తీసుకొచ్చానన్నారు.

క్లుప్తంగా

ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా రక్తనిధి కేంద్రంలో మూడునెలల ల్యాబ్ టెక్నీషియన్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చైర్మన్ పి.జగన్మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎంఎల్‌టీ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో స్టైఫండ్, సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పక్కన ఉన్న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ఈ నెల 25లోగా దరఖాస్తులు అందజేయాలని, మరిన్ని వివరాలకు 08942-226555, 92471 37111 నంబర్లను సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


కాధ నందేశ్వరరావు(ఫైల్)

బూర్జ: మండలంలో తుద్దలి గ్రామానికి చెందిన కాధ నందేశ్వరరావు అలియాస్ వెంకన్న (45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గురువారం ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం ఆమదాలవలస వైపు నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఎదురుగా పాలకొండ వైపు నుంచి వస్తున్న లారీ ట్రాక్టర్‌ను తప్పించబోయి వెంకన్నను ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేటుకు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈయన పాలకొండ యూనియన్ బ్యాంకులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నారు. భార్య సత్యవతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు


గాయపడిన రామారావు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట కూడలి కింతలిమిల్లు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యతిరాజుల రామారావు గాయపడ్డారు. కేశవరావుపేటకు చెందిన ఈయన సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా, శ్రీకాకుళం వైపు వస్తున్న బైక్ ఢీకొట్టింది. వెంటనే క్షతగాత్రున్ని 108 వాహనంలో సింహద్వారం సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు.

హుండీలో నగదు చోరీ


అభయాంజనేయ ఆలయం

మెళియాపుట్టి : మండలంలోని మర్రిపాడు పంచాయతీ జలక లింగుపురంలో అభయాంజనేయ ఆలయం వద్ద హుండీలోని నగదు అపహరణకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం వేకువజామున చెరువుకు స్నానానికి వెళ్లిన కొంతమంది హుండీ తెరిచి ఉండటాన్ని గుర్తించారు. మెళియాపుట్టి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కందిపప్పు నాణ్యతపై ఆరా


కందిపప్పును పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని దండివీధిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పౌర సరఫరాల అధికారి డి.వెంకట రమణ, ఐసీడీఎస్ పథక సంచాలకులు కె.అనంతలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా సరఫరా చేసిన కందిపప్పును పరిశీలించారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, సివిల్ సప్లయ్ సిబ్బంది పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹215	₹ 235



మహేంద్రగిరులందు.. జీవ వైవిధ్య విందు

ఈ చిత్రంలో బంగారు వర్ణంలో ఉండే పక్షి పేరు గోల్డెన్ ఓరియల్. ఇది అత్యంత అరుదైనది. దాలసరి పరిసర ప్రాంతంలో కనబడుతుంది.

- మనకు చెంతనే అద్భుత ప్రపంచం..
- రాష్ట్ర సరిహద్దుల్లో అరుదైన ప్రకృతి సంపద
- బంగారు, నీలి బల్లి జాతుల నెలవు
- పెడిక్యూర్‌కు ఉపయోగపడే మత్స్య సంపద
- వ్యాధులను నయం చేసే పలు ఔషధ మొక్కలు
- పర్యాటకులకు ఆహ్లాదం
- పరిశోధకులకు ఆహ్వానం

కదారి రాజా, శ్రీకాకుళం డెస్క్:

ఫొటోలు: బందాపు తిరుమల(కాశీబుగ్గ) కొంచాటి ఆనందరావు(మందస)

మహేంద్ర గిరులు ఈ పేరు చెప్పగానే ప్రకృతి ప్రియులు పరవశించిపోతారు. గలగల పారే సెలయేర్లు.. ఎగిరి దుమికే జలపాతాలు.. నాటి చరిత్రకు గుర్తులుగా ఎన్నో ప్రసిద్ధ ఆలయాలు.. ఎత్తైన కొండలపై గిరి గ్రామాలు.. ఇలా ఎన్నో ప్రత్యేకతలు ఈ గిరుల సొంతం. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ప్రకృతి మాత మెడలో పచ్చల పేరులా మెరిసే ఈ ప్రాంతం జీవవైవిధ్యానికి పెట్టింది పేరు. అరుదైన జీవులు, చేపలు.. అద్భుతమైన ఔషధ విలువలు కలిగిన మొక్కలు..వృక్ష సంపద.. పర్యాటకులతో పాటు పరిశోధకుల్ని ఆహ్వానిస్తున్నాయి.

4925 అడుగుల ఎత్తులో..

మహేంద్రగిరులు సముద్ర మట్టానికి 4925 అడుగుల ఎత్తులో ఉన్నాయి. జీవ వైవిధ్యం విస్తృతంగా ఉండడంతో ఈ ప్రాంతాన్ని బయోస్పియర్‌గా గుర్తించాలని వివిధ కమిటీలు ప్రతిపాదించాయి. ఈ గిరుల్లోని అతి ముఖ్యమైన ప్రాంతం ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో ఉన్న దాలసరి జలపాతం.

ఎముక విరిగితే ఇదే ఆధారం..



ఈ మొక్కను చూశారా. గ్రేవియా కుటుంబానికి చెందినది. ఎముకలను అతికించడంలో కీలక పాత్ర పోషించే గుణం దీని సొంతమని స్థానిక గిరిజనులు నమ్మకం. ఈ ఆకుల్ని మెత్తని ముద్దగా చేసి రాస్తే మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు. ఇవి మహేంద్ర గిరుల్లో ఉన్నాయి. ఉద్దానం ప్రాంతంలో ఈ మొక్కను వైద్యంలో అత్యధికంగా వినియోగిస్తున్నారు.


దాలసరి జలపాతం

దాలసరి.. వైవిధ్య సిరి

మహేంద్ర గిరుల్లో ఉన్న జలపాతాల్లో ఇటీవల ప్రాచుర్యంలోకి వచ్చిందే దాలసరి. మందసకు ఆరుకిలోమీటర్ల దూరంలో దాలసరి గ్రామం ఉంది. గ్రామం సమీపంలో ఒడిశా భూభాగంలో ఉన్న దాలసరి జలపాతం ఏడాదిలో నాలుగు నెలలు ఎక్కువ వడితో కనువిందు చేస్తుంటుంది. అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు నీటి వడి తగ్గి పర్యాటకుల్ని ఆహ్వానిస్తుంది. 40 గిరిజన కుటుంబాలు నివాసం ఉండే ఈ గ్రామ పరిసరాల్లో ఎన్నో అపురూపమైన వృక్ష,జీవ జాతులు మనకు దర్శనమిస్తాయి.



ఔషధ ప్రయోగాలకు జీబ్రా..

జలపాతం పరిసరాల్లో మరో అరుదైన రకం చేప జీబ్రా. కొత్త ఔషధాలు తయారు చేసిన ప్పుడు ఈ రకం చేపలపై ప్రయోగాలు చేస్తారు. నీమా ఖైలస్ చేపలు ఇళ్లలో అక్వేరియంలో పెంచుకుంటారు.

పాద సంరక్షణకు గర్రా..

మీరెప్పుడైనా ఫిష్ పెడిక్యూర్ చేయించుకున్నారా.. ఓ నీటి తొట్టిలో మీ పాదాల్ని ఉంచితే వందలాది చేపలు వచ్చి మీ పాదాల చుట్టూ చేరిపోయిన విషయాన్ని గమనించారా.. ఆ చేపలే గర్రా చేపలు. మృత చర్మాన్ని గబగబా లాగించేస్తాయి. పాదసంరక్షణకు స్పాలు, బ్యూటీ పార్లర్లలో వీటిని వినియోగిస్తుంటారు. ఈ చేపలు దాలసరి జలపాతం పరిసరాల్లో అత్యధికంగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. రక్త ప్రసరణను మెరుగుపరచడం ..రక్త ప్రవాహాన్ని ప్రేరేపించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. శరీరంపై ఉన్న బ్యాక్టీరియా ఇతర క్రిములు, మృత శరీర భాగాలను శుభ్రపరచడంలో వీటి పాత్ర అమోఘం.



ట్రెక్కింగ్ టూరిజంపై దృష్టి సారించాలి..



ఒడిశా ప్రభుత్వం ఇప్పటికే మహేంద్ర గిరులను టూరిస్ట్ స్పాట్‌గా గుర్తించింది. ఇప్పటికే మన అధికారులు ఆంధ్రా పరిధి వరకు బీటీ రోడ్డు నిర్మించారు. ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు టూరిజం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళితే సత్ఫలితాలు సాధించొచ్చు. ట్రెక్కింగ్ టూరిజం బాగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి.

– పిరియా రాజారావు, రిటైర్డ్ ఏవో

వాక్ వేను నిర్మించాం..



జీవవైవిధ్యానికి విఘాతం కలగకుండా పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. దాలసరి వరకు ట్రెక్కింగ్ చేసేందుకు వీలుగా వాక్‌వేను నిర్మించాం. భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులపై దృష్టి సారిస్తాం.

–నారాయణరావు, ఏపీటీడీసీ జిల్లా మేనేజర్

పొట్టి చేప.. గట్టి చేత..

ఈ జలపాతం వద్ద స్వచ్ఛమైన నీటి ప్రవాహంలో 12 రకాల చేపల్ని గుర్తించారు. అందులో రెండు అత్యంత అరుదైనవి. వాటిలో ఒకటి గర్రా చేపలు. మరొకటి నీమా ఖైలస్. ఈ రెండింటికీ బోలెడు ప్రత్యేకతలున్నాయి. వీటితో పాటు జీబ్రా చేపలు, పాము తల చేపలు కూడా ఇక్కడ ఉన్నాయి.

అరుదైన సంపదకు ఆలవాలం..



మహేంద్ర గిరుల్లో ఏడు సంవత్సరాలుగా పరిశోధనలు చేస్తున్నాను. 97 రకాల పక్షి జాతులు, 12 రకాలు చేప జాతులు, బంగారు, నీలిరంగు బల్లిని గుర్తించాను. జీవ వైవిధ్యం ఎంతగానో ఉన్న ప్రాంతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలి. పరిశోధనలను ప్రోత్సాహించాలి. ఇక్కడ ఉండే జీవజాతులు మరెక్కడా మనుగడ సాగించలేవు.

–డాక్టర్ కర్రిరామారావు, జీవవైవిధ్య శాస్త్రవేత్త,డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విశాఖపట్నం

ఎన్నో మరెన్నో..

దాలసరి జలపాతం పరిసరాల్లో సరీసృపాలైన రంగులు మార్చే ఆగ్మాలు(కొండ తొండలు), విషసర్పాలు, కొండకోళ్లు, నెమళ్లు, కొండగొర్రెలు, కొండ పిల్లులు, కుందేళ్లు, ముళ్ల పందులు, అడవి పందులు, జింకలు మొదలైన జంతువులు ఇక్కడ సంచరిస్తుంటాయి.

పర్యాటకాభివృద్ధికి ఇలా చేస్తే మేలు..

జీవ వైవిధ్య ప్రాంతమైన దాలసరి జలపాతం పరిసరాలను అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ దృష్టిసారించాలి. కాటేజీలు నిర్మించాలి. ఇక్కడ గర్రాజాతి చేపలు ఎక్కువగా లభ్యమవుతాయి కావున వచ్చే టూరిస్టులకు ఫిష్ పెడిక్యూర్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. పచ్చని ప్రకృతిలో పర్యాటకులు ఈ సేవలు పొందేందుకు ఆసక్తి చూపుతారు. మెడికల్ టూరిజంపై కూడా దృష్టి సారించాల్సి ఉంది.

- స్థానిక గిరిజనులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తే మంచి ఫలితాలుంటాయి.
- అక్వేరియంలో పెంచుకునే చేపల విక్రయాల్ని ఇక్కడ ప్రత్యేక స్టాళ్లలో విక్రయించాలి.
- అత్యంత అరుదైన ఔషధ ప్రయోగాలకు వినియోగించే జీబ్రా జాతి చేపల సంరక్షణకు చర్యలు చేపట్టాలి.
- ఈ ప్రాంతంలో ఉండే ప్రత్యేక జీవజాలానికి సంబంధించిన ప్రత్యేకతలపై విస్తృతంగా ప్రచారం కల్పించాలి.


బంగారు బల్లి..

బల్లి జాతుల్లో అత్యంత అరుదైన బంగారు బల్లి మహేంద్రగిరుల్లో ఉన్నట్లు పరిశోధకుల గుర్తించారు. శేషాచలం అడవుల్లో భాగమైన తిరుమల గిరుల్లో ఈ బంగారు బల్లులు ఉన్నట్లు 1987లో వన్యప్రాణుల సంరక్షణ విభాగం గుర్తించింది. తిరుమలలోని చక్రతీర్థానికి 25 కిలోమీటర్ల దూరంలోని రుద్రగళ ప్రాంతంలో మాత్రమే ఈ బల్లి కనిపించేది. 2018లో అలిపిరి మార్గంలోని మోకాళ్ల పర్వతం వద్ద మెట్ల మార్గంలో ఈ బల్లి భక్తులకు దర్శనమిచ్చింది. ఇటువంటి అరుదైన బల్లిని గత ఏడాది దాలసరి పరిసరాల్లో గుర్తించినట్లు జీవ వైవిధ్య శాస్త్ర వేత్త డాక్టర్ కర్రి రామారావు చెప్పారు.

- దీని శాస్త్రీయ నామం కాలోడాక్టీ లోడస్ అరిస్.
- ఇంగ్లిష్‌లో దీనిని గోల్డెన్ గేకో అని పిలుస్తారు.
- పరిమాణం: 150 మిల్లీ మీటర్ల నుంచి 180 మిల్లీ మీటర్ల వరకు
- సూర్యరశ్మి తగలని ప్రదేశాల్లో సంచరిస్తుంటాయి.
- రాతిగుహల్లో జీవిస్తాయి.
- ఇవి పెరిగే కొద్దీ బంగారు వర్ణంలో కనిపిస్తాయి.

విషపు బల్లి..?

మహేంద్ర గిరుల్లో నీలిరంగు బల్లిని పరిశోధకులు గుర్తించారు. స్థానిక గిరిజనులు వీటిని విషపు బల్లులుగా వ్యవహరిస్తుంటారు. పరిశోధకులు వీటిపై దృష్టి సారించారు.



స్టడీ రిపోర్ట్: గుర్తించిన పక్షి జాతులు: 97 | ఆవృత బీజాలు: 947 | పుష్పించని మొక్కలు: 73 | చేపల జాతులు: 12 | మందస నుంచి దాలసరి: 6 కిలోమీటర్లు

'నోటి దురుసు పనికిరాదు'


గాతలవలసలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

పోలాకి: పవన్ కల్యాణ్‌కు నోటి దురుసు పనికిరాదని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పోలాకి మండలం గాతలవలసలో శుక్రవారం సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైవాహిక బంధంపై నమ్మకం లేని వాడు, పనికి రాని ఆవేశ పరుడు, బీజేపీతో కాపురం చేస్తూ టీడీపీకి కన్నుకొట్టే నాయకుడిగా పవన్ పేరు సంపాదించారని, ఆయన ఏ విషయంలో యువతకు ఆదర్శమో చెప్పాలని ఎద్దేవా చేశారు. ఉత్తరాంధ్ర, ఉద్దానం గురించి పవన్‌కు ఏ మాత్రం అవగాహన లేదన్నారు. 'విమర్శలు చేస్తే చెప్పుతో కొడతావా.. అలా అయితే నిన్ను దేనితో కొట్టాలి..?' అంటూ తీవ్ర స్వరంతో మండిపడ్డారు. ధర్మాన ప్రసాదరావును విమర్శించినంత మాత్రాన నీ పరపతి పెరగదని, ఆయన రాజకీయ జీవితం నువ్వు, నీ కార్యకర్తలు పుస్తకం వేసుకుని చదువుకోవాలని సూచించారు. చంద్రబాబు, పవన్ లే కాదు ఎంతమంది కలసి వచ్చినా జగన్ వెంట్రుక కూడా పీకలేరని, సింగిల్‌గా వస్తే చిత్తుగా ఓడిపోతారనే భయంతోనే ఇలాంటి చిల్లర వేషాలు వేస్తున్నారని ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, మాజీ ఎంపీపీ దుంపల భాస్కరరావు లతో పాటు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు. గొల్లలవలసలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు.

మునగాకు కషాయంతో తెగుళ్ల నివారణ

ఎచ్చెర్ల క్యాంపస్: మునగాకు కషాయంతో పంటల్లో తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రిసోర్సుపర్సన్ సురేష్ అన్నారు. జరజాం పంచాయతీలో ప్రకృతి వ్యవసాయం–తెగుళ్ల నివారణ, మునగాకు ద్రావణం తయారీపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. మునగాకు, బెల్లం, ఆవు మూత్రంతో తయారు చేసే ద్రావణం వల్ల పెద్దగా ఖర్చు ఉండదని, పంటలో పిచికారీ వల్ల తెగుళ్లను నియంత్రించవచ్చని చెప్పారు. సూక్ష్మ పోషకాలతో పంటలకు ప్రయోజనం ఉంటుందన్నారు.

'చంద్రబాబు కోసం యువతను బలి చేస్తున్నారు'


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: చంద్రబాబు ఇస్తున్న ప్యాకేజీలకు కక్కుర్తి పడి పవన్ కల్యాణ్ యువతను బలి చేస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ విమర్శించారు. ఆయన శుక్రవారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర కోసం పవన్‌కు ఏం తెలుసని ప్రశ్నించారు. ఇక్కడి మంత్రులను విమర్శించడం వెనుక టీడీపీ నాయకుల స్క్రిప్ట్ ఉందని ఆరోపించారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ సభలకు జన సమీకరణ జరుగుతోందన్నారు. పవన్ లాంటి ప్యాకేజీ స్టార్ వల్ల రాజకీయాలు భ్రష్టు పడుతున్నాయని అన్నారు. చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చి వల్ల 11 మంది చనిపోతే ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. పవన్ నటనకు తప్ప రాజకీయాలకు పనికిరారని తేల్చి చెప్పారు. చంద్రబాబు చేస్తున్న తప్పుల్ని పవన్ ఎందుకు ప్రశ్నించడం లేదని, అన్యాయంగా 11 మంది చనిపోతే పవన్ ఎక్కడకు వెళ్లాడని, పవన్ తాను ముఖ్యమంత్రి కావడానికి రాజకీయం చేస్తున్నాడా.. లేక చంద్రబాబును ముఖ్యమంత్రి చేసి పెద్ద ఎత్తున ప్యాకేజీలు అందుకోవడానికి తాపత్రయ పడుతున్నాడా అని ప్రశ్నించారు. జిల్లాకు సీఎం వైఎస్ జగన్ ఎంతో మంచి చేస్తున్నారని, కిడ్నీ వ్యాధి నివారణకు వందలాది కోట్లు ఖర్చు పెడుతున్నారని అన్నారు. చంద్రబాబు స్క్రిప్ట్‌తో ప్రజల్ని తప్పుదోవ పట్టించాలని ప్రయత్నిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని దువ్వాడ హెచ్చరించారు.

ప్రజలు బుద్ధి చెప్పినా మారలేదు


రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

ఎల్ఎన్ పేట: 'గత ఎన్నికల్లో పవన్ కల్యాణ్ రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయారు. అంటే ప్రజలు బుద్ధి చెప్పారు. అయినా ఆయన మారడం లేదు..' అని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆమె శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సినిమాల్లో నిర్మాతలు ఇచ్చే డబ్బులు తీసుకుని డైలాగులు చెప్పే పవన్ రాజకీయాల్లోనూ చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీలు తీసుకుని డైలాగులు చెబుతున్నారని ఆరోపించారు. తన పార్టీని 151 స్థానాల్లో గెలిపించిన వైఎస్ జగన్‌ను ఒక్క స్థానంలోనూ గెలవని పవన్ విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక మహిళా మంత్రిని నోటికి వచ్చినట్లు మాట్లాడి విమర్శించటం పవన్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. యువతను రెచ్చగొట్టేలా మాట్లాడటం, మహిళలను గౌరవించకపోవటం పవన్ సినిమా డైలాగు లు చెప్పినట్లుగా ఉందన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదవటం కాదని, అవగాహన పెంచుకుని మాట్లాడాలని సూచించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు పవన్ ఏం చేశారని ప్రశ్నించారు. మహిళలను, మహిళా మంత్రిని, ముఖ్యమంత్రిని కించపరిచేలా మాట్లాడిన పవన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.